నిజాయితీయే నిలువుటద్దం కావాలి–(వ్యాసం) - నారంశెట్టి ఉమామహేశ్వరరావు , **9490799203**

న్యాయబద్ధపు మార్గాన నడుచుచున్న
పాపమంటదు జనులకు బతుకులోన
కొంత తైలము రాసుక కోయునపుడు
చేతి కంటని పనసల జిగురు వోలె

అన్నారొక పద్యకవి .

అదెలాగో చూద్దాం. మానవులు తమ జీవితంలో అనేక కార్యాలు నిర్వర్తిస్తూ ఉంటారు. అందులో భాగంగా తెలిసో తెలియకో కొన్ని పాపాలు చేస్తారు. అయితే నిజాయితీతో న్యాయబద్ధంగా పనులను చేసినట్లైతే వారిని ఏ పాపం అంటుకోదు. అదెలాగో తెలుసుకుందాం. పనస పండులో ఉన్న విపరీతమైన జిగురు చేతికి అంటుకుంటే ఒక పట్టాన వదలదు. దాన్ని వదిలించుకోడానికి చాలా కష్టపడాలి. అదే పనస పండుని కోసే ముందు మనం చేతికి చమురు రాసుకుంటే జిడ్డు ఏమాత్రమూ అంటదు. పనస పండు కోయడానికి నూనె రాసినట్టే మానవులు తలపెట్టిన కార్యాలకు నిజాయితీ కూడ ఉండాలి. మొదటి దానికి జిడ్డు అంటదు, రెండో దానికి పాపం అంటదు అని చమత్కరించారు పద్యకవి .

దాన్ని బట్టి గ్రహించాల్సిందేమంటే నిజాయతీగా ప్రవర్తించినప్పుడు మనుషులకు ఎటువంటి పాపం అంటదు. కాబట్టి నిజాయతీగా ప్రవర్తించాలి. నిజాయితీ యొక్క గొప్పదనం తెలిసినపుడే ఆ గుణాన్ని అవలంబిస్తూ ప్రవర్తించగలం. కాబట్టి ఈనెల ఆ అంశాన్ని వివరంగా తెలుసుకుందాం.

మనిషి జీవితాన్ని గౌరవనీయంగా, ఆనందంగా మార్చేది వారిలోని సుగుణాలు మాత్రమే. సుగుణాలలో ఉత్తమ గుణం నిజాయితీ. మానవ జీవితమనే వనంలో అనేక గుణాలు పుష్పాల్లా విరుస్తాయి. వాటిలో అందాన్ని, సుగంధాన్ని కలిపిన అత్యంత పవిత్రమైన పుష్పం నిజాయితీ. నిజాయితీ అంటే కేవలం అబద్ధాలు చెప్పకపోవడం కాదు. కలిగే ఆలోచనలో, నోటి వెంట వెలువడే మాటల్లో, చేసే చేతల్లో స్పష్టత, పారదర్శకత కలిగి ఉండడం. తన గురించి, తాను చేసే పనుల గురించి ఇతరులకు వాస్తవాలను చెప్పడం. ఇతరుల ముందు ఎలా ఉంటామో, ఒంటరిగా ఉన్నప్పుడు కూడా అలాగే ఉండటం వంటివి నిజాయితీకి అసలైన నిర్వచనాన్ని అందిస్తాయి.

“నిజాయతీతో కూడిన శ్రమలోనే గౌరవం ఉందని” పెద్దలు చెప్పారంటే నిజాయితీ యొక్క ప్రాముఖ్యత అర్థమౌతుంది. అదొక మంచి లక్షణం మాత్రమే కాదు. మనిషి వ్యక్తిత్వాన్ని, అంతరాత్మను ప్రతిబింబించే నిలువుటద్దం లాంటిది. ఈ ఆధునిక యుగంలో, వేగంగా మారుతున్న ప్రపంచంలో, నిజాయితీ అనే విలువను మనం తరచుగా మర్చిపోతున్నాం. కానీ ఆ గొప్ప గుణమే వ్యక్తులను, తద్వారా సమాజాన్ని ఉన్నతంగా నిలబెడుతుంది.

“నిజాయతీని మించిన సంపద లేదు” అని గ్రంథాలు బోధించినట్టు నిజాయితీ లేకపోతే సంపద ఉన్నా నిరర్థకమవుతుంది. ఉన్న జ్ఞానమంతా నిస్సారమవుతుంది. పేరు ప్రతిష్ఠలెన్నున్నా నిష్ప్రయోజనమవుతాయి. అందుకే చిన్నప్పటినుంచే నిజం మాట్లాడటం, తప్పును ఒప్పుకోవడం, సత్యసంధతతో నడుచుకోవడం అవసరమని పిల్లలకు నేర్పాలి. పెద్దలు కూడ చిత్తశుద్ధితో నిజాయతీని పాటించాలి.

నీతిప్రౌఢవిహారులైన నిపుణుల్ నిందింపనీ మెచ్చనీ
ఖ్యాతిం జెందిన సంపదల్ నిలువనీ గాఢంబుగా సాగనీ
ఘాతం బప్పుడ పొందనీ నియతిమై గానీ యుగాంతంబునన్
నీతిశ్లాఘ్యపదంబు దప్పరు గదా నిత్యంబు ధీరోత్తముల్.

అన్నారు భర్తృహరి. ఎవరు నిందించినా , ప్రశంసించినా, సంపదలు వచ్చినా , తొలగిపోయినా , మరణమిప్పుడే వచ్చినా లేక కల్పాంతమందు వచ్చినా ధీరులైన వారు ఎట్టి పరిస్థితుల్లోనూ న్యాయమార్గాన్ని దాటి ఒక్క అడుగైనా ముందుకు పెట్టరని పై పద్యం వివరిస్తోంది .

పైన చెప్పినట్టు కష్టాలు , నష్టాలూ వచ్చినా , బాధపెట్టినా కూడా నిజాయితీపరులు న్యాయమార్గాన్ని వదలరు. ఆ మార్గంలో ప్రయాణించడం వల్ల తాత్కాలికంగా వారికి కష్టాలు ఎదురైనప్పటికీ చివరికి విజయమే వరిస్తుంది. అందుకే తాత్కాలికంగా వచ్చే కష్టాలకు బాధపడి నిజాయితీని వీడకుండా ముందుకు సాగినప్పుడే నిజాయతీకి తగిన ప్రతిఫలం దక్కుతుంది .

“నిజాయతీపై ఎక్కువ విశ్వాసం గలవారే అందరి చేత గౌరవింపబడతారు” అని పెద్దలు చెప్పినట్టు పనిలో జాగ్రత్తగా, నిజాయితీగా ఉండే వ్యక్తుల పట్ల గురువులు, తల్లిదండ్రులు, స్నేహితులు గౌరవం పెంచుకుంటారు. నిజాయితీగల మనిషి అబద్ధాల సముద్రంలో తేలిపోకుండా సత్యం అనే తీరాన్ని చేరుతాడు. అతని ముఖంలో ఒక ప్రశాంతత ఉంటుంది, అతని చూపులో ఒక వెలుగు ఉంటుంది.

చక్కనైన రాజ మార్గమది యుండంగ
సందుగొందుల వెంట బోవనేల?
వెఱ్ఱివగుచు నీవు వెతల చెందగనేల?
మంచిమాట వినర మానవుండ!

అని భమిడిపాటి కామేశ్వరమ్మ గారు ఒక పద్యంలో చెప్పినట్టు చక్కని రాజమార్గం లాంటి నిజాయతీ అనే దారి ఉండగా ముళ్లతో నిండిన అడ్డదారులు తొక్కడం అవసరమా? ఆ విషయం గుర్తుంచుకొని ప్రవర్తించాలి మనుషులు.

నిజాయితీ అనేది కంటికి కనిపించదు. కానీ హృదయాన్ని తాకుతుంది. నిజాయితీగల వారి మాటలో నమ్మకం ఉంటుంది. వారి చేతల్లో ధర్మం ఉంటుంది. వారి మనసులో దివ్యత్వం ఉంటుంది.

అబద్ధం చెప్పి లాభం పొందిన వాడికి తాత్కాలికంగా సుఖం లభించవచ్చు కానీ నిజాయితీగల వారికి జీవితాంతం గౌరవం లభిస్తుంది. నిజాయితీ వలన ధనం రాకపోయినా ధైర్యం ఉంటుంది. పదవి రాకపోయినా, పౌరుషం ఉంటుంది. ప్రతిష్ఠతో బాటు ప్రశాంతత ఉంటుంది.

నిజాయితీగా ఉన్నవారు తమ గురించి ఎవరికీ ఏమీ దాచాల్సిన అవసరం ఉండదు. ఇది వారిలో అపారమైన ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. అబద్ధాల పునాది మీద నిలబడిన జీవితం ఎప్పుడూ భయంతో, అభద్రతా

భావంతో ఉంటుంది. అదే … సత్యమే పునాదిగా ఉన్న వారి జీవితం ధైర్యంగా, నిశ్చయంగా ఉంటుంది. నిజాయితీ గల వ్యక్తి ఎవరి కళ్ళలో కైనా నేరుగా చూడగలడు.

నిత్య జీవితంలో నిజాయితీని ఆచరణలో చూపడమెలాగన్న సందేహం కలగవచ్చు. అదెలాగో తెలుసుకుందాం.

రోజువారీ జీవితం చిన్న చిన్న విషయాలతో మొదలౌతుంది. వాటిలోనే మన నిజాయితీని చూపించవచ్చు. పాఠశాలలో పరీక్ష రాస్తున్నప్పుడు ముందున్న వారి జవాబు పత్రం కాపీ చేయకుండా సొంతంగానే జవాబులు రాయాలి. మార్కులు ఎన్ని వచ్చాయని కాదు. నిజాయతీగా ఎన్ని మార్కులు తెచ్చుకున్నామన్నది తెలుసుకోవాలి.

నీదిగాని దానికెన్నడాశించకు,
నీదియైన దాని వదలబోకు
నీకు సాటి రారు నిలలోన నెవ్వరు
మంచిమాట వినర మానవుండ!

అని పద్యకవి చెప్పినట్టు ఏదైనా ప్రదేశంలో అయాచితంగా దొరికిన వస్తువును, నగదును, బంగారాన్ని ఎప్పుడూ సొంతం చేసుకోకూడదు. దానిని యజమానికి తిరిగి ఇవ్వాలి.

తమ వల్ల చిన్న తప్పులేవైనా జరిగినా తల్లిదండ్రులకు స్పష్టంగా చెప్పాలి.
ఆటల్లో క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలి . ఆటలాడేటప్పుడు ఓడిపోయినా, గెలుచుకున్నట్లు నటించకూడదు.
దేని గురించైనా ఎవరికైనా వాగ్దానం చేసేటప్పుడు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.

ఇలాంటి చిన్న చిన్న విషయాలే మనిషి యొక్క స్వభావాన్ని నిర్మిస్తాయి. వయసు పెరుగుతున్న కొద్దీ సత్యసంధులుగా గుర్తింపు పొందుతారు.

అబద్ధం చెబుతున్నప్పుడు ముందంతా తియ్యగా ఉంటూ తాత్కాలికంగా లాభముందనే భ్రమ కలుగుతుంది. తర్వాత దాని వల్ల వచ్చే భయం, నింద, నమ్మకం కోల్పోవడం వంటివి జీవితాన్ని క్లిష్టతరం చేస్తాయి . అబద్ధం చెప్పిన విషయం తెలిసిపోతే నమ్మకం పోతుంది. ఒకసారి నమ్మకం కోల్పోతే వారి మాటలను మరోసారి ఎవరూ నమ్మరు. కాబట్టి కష్టమైనా, నష్టమైనా నిజాన్ని చెప్పే ధైర్యం ఉండాలి.

వ్యక్తిగత సంబంధాలు, వ్యాపార భాగస్వామ్యం వంటి ఏ బంధమైనా నిలబడాలంటే నమ్మకం ముఖ్యం. నమ్మకాన్ని పెంచే ఏకైక మార్గం నిజాయితీ. నిజాయితీ అనేది నమ్మకానికి తల్లి లాంటిది. ఒక ఉద్యోగి నిజాయితీగా ఉంటే, యజమానికి అతనిపై నమ్మకం పెరుగుతుంది. ఒక స్నేహితుడు నిజాయితీగా ఉంటే, ఆ స్నేహం శాశ్వతం అవుతుంది. కుటుంబ సభ్యుల మధ్య నిజాయితీ ఉంటే, ఆ కుటుంబం బలంగా ఉంటుంది.

“నిజాయితీగల వ్యక్తులే నేటి సమాజానికి నిజమైన దిక్సూచి లాంటి వారు” అని చెప్పినట్టు వ్యక్తులు ఈ గుణాన్ని నిత్యజీవితంలో పాటించడానికి అలవాటు పడాలి. నిజాయితీగా ఉండటం ఎందుకు ముఖ్యమో చూద్దాం.

1. నిజాయితీగా వ్యవహరించే వ్యక్తులపై ఇతరులకు సహజంగానే నమ్మకం, విశ్వాసం కలుగుతాయి. కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహోద్యోగులు మరియు పరిచయస్తులు వారిని ఎక్కువగా విశ్వసిస్తారు. ఈ నమ్మకమే ఆరోగ్యకరమైన మరియు బలమైన సంబంధాలకు పునాది. అబద్ధాలు చెప్పేవారిని ఎవరూ విశ్వసించరు. ఇది ఒంటరితనానికి దారితీయవచ్చు.
2. సత్యానికి కట్టుబడి, పారదర్శకంగా ఉండే వ్యక్తులను సమాజంలో అందరూ గౌరవిస్తారు. నిజాయితీగా ఉండే వ్యక్తి తప్పు చేసినా దానిని ఒప్పుకోవడానికి వెనుకాడడు. ఈ లక్షణం వారి పట్ల గౌరవాన్ని మరింత పెంచుతుంది.
3. నిజం మాట్లాడినప్పుడు, చేసిన పనులకు బాధ్యత వహించినప్పుడు మనస్సాక్షి ప్రశాంతంగా ఉంటుంది. అబద్ధాలు, మోసాలు చేసినప్పుడు పట్టుబడతామనే భయం, అపరాధ భావన మనల్ని వెంటాడుతాయి. నిజాయితీగా జీవించడం వల్ల ఆత్మగౌరవం (self-respect) పెరుగుతుంది మరియు మనసు ప్రశాంతంగా, తేలికగా ఉంటుంది.
4. సామాజిక క్రమానికి కూడా నిజాయితీ ముఖ్యం. చట్టాలకు లోబడి, పన్నులు సరిగ్గా చెల్లించి, మోసాలకు పాల్పడకుండా ఉండే నిజాయితీగల పౌరులు ఉన్నప్పుడు, సమాజం మరియు దేశం సక్రమంగా అభివృద్ధి చెందుతాయి.
5. ఒక సంస్థలో లేదా ఒక బృందంలో నాయకుడిగా ఉండేవారికి నిజాయితీ అనేది అత్యవసరమైన లక్షణం. నాయకుడు నిజాయితీగా ఉన్నప్పుడు, అతనిని అనుసరించే సభ్యులు కూడా క్రమశిక్షణతో మరియు ప్రేరణతో పని చేస్తారు.

నిజాయితీ అనేది ఏ మార్కెట్‌లోనూ కొనలేని అపురూపమైన ఆభరణం. మనం చేసే ప్రతి పనిని మన అంతరాత్మ అనే నిలువుటద్దం చూస్తూనే ఉంటుంది. ఆ అద్దంలో మన ప్రతిబింబం చూసి మనం గర్వపడగలిగితే, అదే మన జీవితంలో అతి పెద్ద విజయం. నిజాయితీని జీవితంలో ఒక అలవాటుగా కాకుండా, జీవనశైలిగా మార్చుకుందాం. అప్పుడే మనిషిగా మన విలువ పెరుగుతుంది, మనకు గౌరవం దక్కుతుంది.

సమాజ నిర్మాణంలో నిజాయితీ పాత్ర ముఖ్యమైనది. ఒక ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడాలంటే, అందుకు పౌరులు, నాయకులు, పాలకులు అందరూ నిజాయితీతో ప్రవర్తించాల్సిన అవసరముంది.

పాలకులలో నిజాయితీ ఉంటే పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం (Accountability) పెరుగుతుంది.

వ్యాపారంలో నిజాయితీ ఉంటే వినియోగదారులకు నాణ్యమైన సేవలు, సరైన ధరలు అందుతాయి.

విద్యారంగంలో నిజాయితీ ఉంటే విద్యార్థులు కాపీయింగ్ వంటి దురలవాట్లకు దూరంగా ఉండి, నిజమైన జ్ఞానాన్ని పొందుతారు.

నిజాయితీ లేకపోతే సమాజంలో అవినీతి, మోసం, అన్యాయం పెరిగిపోతాయి. అప్పుడు ఆ సమాజం యొక్క పునాదులు కదిలిపోతాయి.

నిజాయితీ అనేది మన అంతరంగంలో వెలిగే దీపం వంటిది. అది ఆరిపోకుండా కాపాడుకోవాలి. ఎవరూ చూడకపోయినా, ఎవరు మెచ్చుకోకపోయినా, మన మనస్సాక్షి మనకు శభాష్ అని మెచ్చుకునేలా జీవించడమే నిజమైన విజయమని పురాణాలు వర్ణించాయి.
ధర్మరాజు, నల మహారాజు, హరిశ్చంద్రుడు, శ్రీరాముడు మొదలైన వారు నిజాయితీగా జీవించి ప్రజలకు ఆదర్శప్రాయులయినట్టు, వారంతా ధర్మం, నీతి, నిష్పక్షపాతం, విశ్వసనీయత వంటి గుణాలకు ప్రసిద్ధి చెందారని తెలిపాయి. ఒక్కొక్కరి గురించి మరింత వివరంగా తెలుసుకుందాం.

నిజాయితీ, ధర్మానికి ప్రతీకగా నిలిచిన నలమహారాజు, తన దాయాదితో జరిగిన జూదంలో పరాజయం పొందాడు. పందెం ప్రకారం తన రాజ్యాన్ని అప్పగించాడు. భార్యా పిల్లలతో అడవులకు వెళ్లాడు . వేరొక రాజు కొలువులో అజ్ఞాతంగా జీవించాడు. వంటమనిషి గా పనిచేసాడు తప్ప నిజాయితీని వదులుకోలేదు ఆయన.

సత్యానికి కట్టుబడి ఉండటం, ధర్మాన్ని నిలబెట్టడం వంటి సుగుణాలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చిన పురాణ పురుషుడు శ్రీరాముడు. తండ్రి దశరథ మహారాజు ఇచ్చిన మాట నిలబెట్టడానికి 14 సంవత్సరాలు అరణ్యవాసం చేశారు. ఒకే మాట, ఒకే బాణం, ఒకే పత్ని అన్నట్టు జీవించారు. నిజాయితీకి, త్యాగానికి గొప్ప ఉదాహరణగా నిలిచారు.

పాండవులలో పెద్దవాడైన ధర్మరాజు, ధర్మానికి, నిజాయితీకి ప్రతీక. ఆయన జీవితంలో అబద్ధం చెప్పలేదు. కౌరవులతో జరిగిన మాయా జూదంలో ఓడిపోయినప్పుడు పందెం ప్రకారం 12 సంవత్సరాలు అరణ్యవాసం, ఏడాది అజ్ఞాతవాసం చేసారు. ఆయన రథం భూమికి నాలుగు అంగుళాల పైన ప్రయాణించేదని పురాణాలు చెబుతాయి. ఇది ఆయన స్వచ్ఛమైన నిజాయితీకి సంకేతం.

సత్య హరిశ్చంద్రుని కథ నిజాయితీకి పరాకాష్ట. విశ్వామిత్ర మహర్షి పరీక్షలో భాగంగా, తన రాజ్యాన్ని, కుటుంబాన్ని పోగొట్టుకుని, చివరికి కాటికాపరిగా పని చేస్తూ కూడా ఇచ్చిన మాటకు కట్టుబడ్డాడు. తన భార్య, కుమారుడి విషయంలోనూ సత్యాన్నే పలికాడు, చివరికి దేవతల మెప్పు పొందాడు.

అలాంటి మహా పురుషులు నడయాడిన పుణ్యభూమి భారతదేశంలో జన్మించడం మన అదృష్టంగా భావించాలి. వారు పాటించిన సుగుణాలను మనం కొంతైనా పాటించాలి.

మలినమంటకుండ మనసునుంచితివేని
ఆత్మసాక్షాత్కార మందగలవు
మసిబారు అద్దమున మనిషి కనిపించునా?
మంచి మాట వినర మానవుండ!

అని పద్యకవి భమిడిపాటి కామేశ్వరమ్మ చెప్పినట్టు తమ జీవితాలకు మలినం అంటకుండా నిజాయతీగా గడిపిన మహానుభావులు మన కాలంలోనూ ఉన్నారు. అంతే కాదు నిజాయతీగా ఉన్న వ్యక్తిని గుర్తించి ఉద్యోగమిచ్చి ప్రోత్సహించిన ఒక ప్రముఖుని కథ చదువుదాం .

ఒకసారి డాక్టర్ సి. వి. రామన్ గారు బెంగుళూరులోని తన విజ్ఞాన పరిశోధన కేంద్రంలో పనిచేయడానికి ఉన్నత విద్యార్హతలు గల అభ్యర్థులు కావాలని పత్రికల్లో ప్రకటన జారీ చేసారు.

ఆ ఉద్యోగాల కోసం ఎన్నో ప్రదేశాల నుండి అభ్యర్థులు వచ్చారు. వారందరినీ ఇంటర్వ్యూ చేసి ఉత్తములైన వారిని కావాల్సినంతమందిని ఎంపిక చేసుకొని మిగతా వారిని వెళ్లిపొమ్మని చెప్పారాయన.

ఒక గంట గడిచిన తర్వాత ఎంపిక కాని వ్యక్తుల్లో ఒకరు ఆఫీసు బయటి వరండాలో కనిపించగా, అతన్ని చూసారు సి. వి. రామన్.

"నిన్ను వెళ్లిపొమ్మని చెప్పినా ఇంకా ఉన్నావేం? " అని అడిగారు ఆయన.

అందుకా వ్యక్తి "మీ ఆఫీసు వారు రాకపోకలకు చార్జీలు చెల్లిస్తూ పొరపాటున కొంత డబ్బు ఎక్కువ ఇచ్చారు. దానిని తిరిగి ఇవ్వడానికి వచ్చాను. ఇప్పుడు వెళ్లిపోతాను" అని బదులిచ్చాడు.

ఆ మాటలు విన్న డాక్టర్ సి. వి. రామన్ ఎంతో సంతోషంతో ఆ వ్యక్తిని దగ్గరకు పిలిచారు. "అబ్బాయీ ! నాకు కావాల్సింది నీలాంటి నిజాయితీ పరులే. నీవు తిరిగి వెళ్లనవసరం లేదు. ఇక్కడే ఉండిపో . నిన్ను అదనంగా నియామకం చేసుకుంటున్నాను" అని ఉద్యోగానికి ఎంపిక చేసుకున్నారు.

చూసారు కదా. ఇతర అర్హతల కంటే కూడా నిజాయితీయే ఎక్కువ విలువైనదని మనకి తెలిసింది కదా.

అలాగే బాల్యంలో నిజాయతీ చూపిన మరో నాయకుడి గురించి చదువుదాం.

మితవాద కాంగ్రెస్ నాయకుడుగా పేరున్న గోపాలకృష్ణ గోఖలే గారి బాల్యంలో జరిగిన సంగతి ఇది. ఆయన హైస్కూల్ లో చదివే రోజుల్లో వారి తరగతి ఉపాధ్యాయుడు పిల్లలందరికీ ఒక లెక్క ఇచ్చి ఇంటి వద్ద చేసుకుని రమ్మన్నాడు.

మరునాడు గోఖలే తప్ప ఇంకెవ్వరూ ఆ లెక్క చేసి చూపలేకపోయారు. ఉపాధ్యాయుడు గోఖలేని మెచ్చుకుని తరగతిలో గొప్పగా పొగిడారు.

గోఖలే అందుకు ఆనందించలేదు . సరికదా ఒక్కసారిగా ఏడవ నారంభించాడు. ఉపాధ్యాయుడు అతని విచారానికి కారణమడిగారు. ఆ లెక్కను తాను స్వయంగా చెయ్యలేక పోయానని, తన అన్న చేసి ఇచ్చాడని , అందుకే తాను ప్రశంసలకు అనర్హుడనని చెప్పుకున్నారు .

ఉపాధ్యాయుడు గోఖలే చూపిన నిజాయితీకి సంతోషించాడు. బాల్యం నుండే నిజాయతీని అలవరచుకోవాలని ఈ కథ మనకు చెప్పింది.

'నిజాయతీ గల సేవ నుంచి అధికారం కలుగుతుంది' అని చెప్పడమే కాకుండా ఆచరణలో చేసి చూపించారు మహాత్మా గాంధీ. అహింస, సత్యమే నా దేవుళ్ళు అని చాటుతూ జీవించారు. బాల్యంలో తాను చేసిన తప్పుని వివరిస్తూ తండ్రికి లేఖ రాసి క్షమాపణ అడిగారు . తండ్రిని క్షమించమని కోరిన తరువాత మాత్రమే తనకి మనశ్శాంతి కలిగినట్టు చెప్పుకున్నారు. తన నిజాయితీ వల్ల ఆయన జీవితాంతం సత్యానికి విలువ ఇచ్చారు.

బాల్యంలోనే అమెరికా అధ్యక్షుడు అబ్రహం లింకన్ చూపిన నిజాయితీని తెలిపే కథ ప్రచారంలో ఉంది. ఆయన ఒక దుకాణంలో పనిచేస్తుండగా టీ పొట్లం కొన్న రైతుకు పొరపాటున ఆరు సెంట్లు తక్కువ డబ్బు ఇచ్చినట్టు , కొట్టు కట్టేసే సమయంలో గుర్తించారు. అందుకు ఎంతో మనస్తాపం చెందారు ఆయన. ఆ రాత్రి చీకటిలోనే రైతు ఉండే గ్రామానికి వెళ్లి డబ్బుని తిరిగి ఇచ్చారు. లింకన్ చూపిన నిజాయతీకి ఆ రైతు పొంగిపోయి ఊరంతా చాటింపు వేసాడు.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ గారు తన పదవిలో ఉన్నప్పుడు చిల్లిగవ్వ కూడా అన్యాయంగా వాడలేదు. పదవీ విరమణ అనంతరం రాష్ట్రపతి భవనం ఖాళీ చేసినప్పుడు కూడ కొన్ని జతల దుస్తులు , పుస్తకాలు మాత్రమే తనతో తీసుకువెళ్ళడం ఆయన నిజాయితీని చాటుతుంది.

వారంతా నిజాయితీగా ప్రవర్తించిన కారణం వల్లనే వారి పేర్లు కాలాన్ని దాటి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి.

అలాంటి మహానుభావులు మాత్రమే కాదు, మన చుట్టూ ఉన్న సాధారణ మనుషుల్లోనూ ఈ గుణం కనిపిస్తుంది . తన శ్రమతో కుటుంబాన్ని పోషించే తండ్రి, తన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించే ఉపాధ్యాయుడు, ఉద్యోగి వంటి వారందరూ నిజాయితీకి ప్రత్యక్ష రూపాలు.

నిజాయితీ లేని మనిషి గాలిలోని దీపంలా ఉంటాడు. అబద్ధం, మోసం, కపటం మనిషిని క్రమంగా లోపల నుంచి ఖాళీ చేస్తాయి. నమ్మకం కోల్పోయిన మనిషి దారిద్ర్యంతో కాదుగాని, విశ్వాసం లేకపోవడంతో పాడవుతాడు.

నేటి యాంత్రిక యుగంలో మనుషులు డబ్బు కోసం, పదవి కోసం, ప్రఖ్యాతి కోసం కాలంతో బాటు పరుగులు తీస్తున్నారు.. కానీ ఈ వేగంలో నిజాయితీ అనే విలువ మసకబారకూడదు.
నిజాయితీ మనిషిని కేవలం మంచి పౌరుడిగా కాకుండా, మంచి మనిషిగా తీర్చిదిద్దుతుంది.

తనువదెవరి సొమ్ము తనదని పోషింప
ద్రవ్యమెవరి సొమ్ము దాచుకొనగ
 బ్రాణమెవరి సొమ్ము పారిపోవక నిల్వ
విశ్వదాభిరామ వినురవేమ

ఎప్పటికీ ఉండిపోయేలా కాపాడదామంటే శరీరం మనది కాదు. దాచుకుందామంటే ధనం మరీ కాదు. పారిపోకుండా పట్టుకుందామంటే ప్రాణం మన సొత్తు కాదు. అన్నీ అశాశ్వతమైనవే అయినప్పుడు దేని కోసం ఈ పడరాని పాట్లు అని పద్యకవి వేమన చెబుతున్నారు.

పై వేమన పద్యం చదివాక ఏదీ మన సొంతం కాదని. శాశ్వతమసలే కాదని . మరి తప్పుడు మార్గంలో నడిచి సంపద పోగేయడంలో ప్రయోజనం లేదని బోధపడింది. పదిమందీ మెచ్చేలా నిజాయతీగా జీవిస్తే కనీసం పరువు, గౌరవం పెరుగుతాయి. నైతిక బలం పెరిగి సంపూర్ణ వ్యక్తిత్వాన్ని లోకానికి చూపుతుంది.

నిజాయితీయే  మనిషికి నిలువుటద్దం అనేలా జీవించాలి. ఈ అద్దం ఎప్పుడూ స్వచ్ఛంగా, ప్రకాశవంతంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత మనదే.

తాత్కాలిక లాభాల కోసం సత్యాన్ని వదులుకోవడమంటే  అంతరాత్మను చీకట్లోకి నెట్టడమే.  రేపటి తరానికి మంచి సమాజాన్ని అందించాలంటే, ప్రతి ఒక్కరూ "నేను నిజాయితీగా ఉంటాను" అని ప్రతిజ్ఞ చేయాలి.

నిజాయితీ మనిషి జీవితానికి ఆభరణం మాత్రమే  కాదు, ఆత్మస్వరూపం.  అదే మన పథం, అదే మన ప్రాణం. మనమంతా ఈ సత్యమార్గంలో నడిస్తే — మనం మాత్రమే కాదు, సమాజం కూడా ప్రకాశిస్తుంది.

పిల్లలూ…  వ్యాసం చదివారు కదా. ఇది మీ కోసమే రాసినది కాబట్టి మీరు ఆ మంచి లక్షణం అలవర్చుకోవాలి. నిజాయితీపరులనే మంచి పేరు గడించాలి . మిమ్మల్ని కన్న తల్లిదండ్రులకు, పుట్టిన ఊరుకూ, దేశానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చే ఉత్తమ పౌరులు అనిపించుకోవాలి.

—--****----